# బుద్ధగయ

"అమ్మా! డాక్టరమ్మా! తొందరగా అపరేషన్ చెయ్యమ్మా! లేకుంటే మా ఆడది చచ్చిపోతది. పొద్దట్నుంచి ఎంత మొత్తుకున్నా ఇంటలేక పోతివి. పైస లేడికి పోతయి? మా ఇస్తనమ్మా!"

డాక్టర్ సరోజ కెదురుగా నిల్చుని రెండు చేతులెత్తి దండం బెడుతూ దీనంగా వేడుకుంటున్నాడు నర్సయ్య. అతని అభ్యర్థనను ఏమాత్రం సీరియస్‌గా తీసుకోలేదామె.

"నీ కెన్ని సార్లు చెప్పాలి, డబ్బులేనిదే అపరేషన్ చెయ్యనని! మీలాంటి వాళ్లను నమ్మడం కష్టం. డబ్బు తెస్తేనే అపరేషన్..." మామూలుగా అంది సరోజ.

"ఈ పట్నంలో మాకు తెలిసిన వాళ్లెవ్వలు లేరు. పొద్దట్నుంచి తిరుగుతున్నా పైస ల్దొరుకుత లెవ్వు. నా పెండ్లాం మీద పుస్తెల తాడుంచుకొని ఇయ్యమన్నా ఎవ్వలిస్తలేరు. అగో, నా పెండ్లాం మెలికలు తిరిగిపోతుంది. అల్చైమైతె చచ్చిపోతదమ్మా... నీ బాంచెనమ్మా! తొందరగా అపరేషన్జెయ్యి..."

నర్సయ్య ఎంత దీనంగా ప్రార్థిస్తున్నా ఆమె మనసు కరగడంలేదు. తన పట్టు విడువదలుచుకోలేదు. ఆ గదిలో ప్రసవవేదనతో నరకయాతన ననుభవిస్తున్న నర్సయ్య భార్యను చూసైనా ఆమె దిగిరాదలుచుకోలేదు.

"నువ్వెన్నైనా చెప్పు డబ్బులు తెస్తేనే అపరేషన్" అంటూ ఆ గదిలోంచి బయటకు రాబోయింది సరోజ.

ఆమె కా అవకాశం ఇవ్వకుండా ఆమె రెండు కాళ్ళు పట్టుకున్నాడు నర్సయ్య. మాసిన గడ్డం, తలకు రుమాలతో మురికిగా, మొరటుగా ఉన్న నర్సయ్యను చూసి చీదరించుకుంది సరోజ. తల పైకెత్తి ఆమెను చూస్తూ-

"నీ కాల్మొక్కుత తల్లీ! మాది కోరుట్లమ్మా! నువ్వే మంచి డాక్టరువని ఇక్కడి కచ్చినం. అంత దూరం పోయిరావన్నంటే కష్టమమ్మా! అపరేషనైనంక పొయ్యి పైసలత్తనమ్మా! పైస లేడికి పోవు తల్లీ! అంత లాఐతే ఇగో గీ పుస్తెల తాడుంచుకో..." వేడుకోలుగా అన్నాడు నర్సయ్య.

అయినా ఆమె మనసు కరగలేదు.

"ఇవేం చేసుకోను? అయినా వీటి కేమొస్తాయని? పుస్తెల తాడుంచుకుందన్న బదనాం నా కెందుకు? అపరేషన్ చేసిం తర్వాత ఇద్దరు బతికితే మంచిదే. తల్లో, పిల్లో చనిపోతే మీ నుంచి డబ్బులు రాబట్టడం కష్టం, ఏడ్పులు... అర్పులు... డబ్బు తెస్తేనే అపరేషన్" అంటూ కాళ్లను విడిపించుకోవడానికి ప్రయత్నించింది డాక్టరమ్మ.

"డాక్టరమ్మ కాళ్లిడిసిపెట్టు." గద్దరించినట్టంది సిస్టర్.

అయినా నర్సయ్య సరోజ కాళ్లు వదలలేదు.

నర్సయ్య కళ్ల వెంట కారుతున్న నీళ్ళు సరోజ కాళ్ళు కడుగుతున్నాయి.

"అమ్మా! డాక్టరమ్మా! సంతానం లేక పదేండ్ల నుంచి అష్టకష్టాలు పడుతున్నమమ్మా! మేము నోమని నోములు లేవు. తిరగని గుళ్ళు లేవు. అడగని డాక్టర్ లేడు. ఎన్నో నోములు నోస్తే అయిన కడుపమ్మా ఇది. ఆల్చిమైతె బిడ్డ దక్కదమ్మా! తెచ్చిన పైసలన్నీ ఐపోయినయమ్మా! నీ బాకీలేం బడిపోను. నా చర్మం ఒలిచి చెప్పులు కుట్టించైనా నీ బాకీ తీరుస్తానమ్మా! జెప్ప నాపరేషన్జెయ్యి." గొడగొడా ఏడుస్తూ అన్నాడు నర్సయ్య.

అయినా సరోజ వినదలుచుకోలేదు. ఇలాంటి అలగా జనం మాటలు విని తన పట్టు విడువదలుచుకోలేదు. అతన్ని విడిపించ మన్నట్టు సిస్టర్ దిక్కు చూసింది సరోజ... సిస్టర్ నర్సయ్య చేతులు లాగుతూ... "డబ్బుల దగ్గర డాక్టరమ్మ స్ట్రిక్ట్" అంది.

డాక్టర్, సిస్టర్ నర్సయ్య మాటలేం వినిపించుకోకుండా ఆ గదిలోంచి బయటకు రాబోయారు.

పది నిముషాలుగా గది బయటుండి వాళ్ల మాటలు వింటున్న రాజేశం మనసు వికలమైంది. కళ్లు చింతనిప్పు లయ్యాయి. కోపోద్రిక్తమైన ముఖంతో గది ద్వారం దగ్గర నిల్చున్న రాజేశాన్ని చూసి అలాగే నిల్చున్నారు సరోజ, సిస్టర్.

"నీ కేమన్న మానవత్వముందా? నువ్వసలు మనిషివేనా?" పట్టరాని ఆగ్రహంతో అన్నాడు రాజేశం.

అతన్ని చూడలేక సరోజ తల దించుకుంది. అందర్నీ గడగడలాడించే డాక్టర్ సరోజ అతన్ని చూసి తల దించుకోవడం ఆ గది బయటున్న పేషంట్ల కాశ్చర్యం కలిగించింది. డాక్టర్నే శాసించగల అతడెవరో వాళ్ల కర్థం కాలేదు.

అతని ముఖంలో ఐదున్నర దశాబ్దాల కాలాన్ని కాచి వడబోసిన జీవితానుభవా లున్నాయి. అతడెవరో కాదు - సరోజ తండ్రి రాజేశం, ఆమెను అల్లారుముద్దుగా పెంచిన తండ్రి. తానెలా బతికినా కూతురుకు కష్టమంటే ఏమిటో తెలియకుండా పెంచాడు. ఆమె డాక్టర్ కావడానికి అతని ప్రోద్బలం, పట్టుదల, శ్రమ ఇతోధికంగా ఉన్నాయి. సరోజకు తానే గురువై, మిత్రుడై, సర్వమై దగ్గరుండి చదివించాడు. ఒక తండ్రిని తప్ప సరోజ మరెవరినీ లక్ష్యం చేయదు.

తల వంచుకొన్న సరోజేం మాట్లాడలేదు.

"పేషంటును వెంటనే ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్ళు. ఆపరేషన్ కేర్పాట్లు త్వరగా కానియ్" అన్నాడు రాజేశం.

"నాన్నా!" ఏదో చెప్పబోయింది సరోజ.

"నువిప్పుడేం మాట్లాడొద్దు. త్వరగా ఆపరేషన్ కానియ్. ఇప్పటికే ఆలస్యమైంది." శాసించినట్టన్నాడు రాజేశం.

సరోజ సిస్టర్ దిక్కు చూడగానే ఆమె గబగబా ఏర్పాట్లు చేయడానికి థియేటర్ కెళ్ళింది. పావుగంటలో పేషంటును థియేటర్‌కు తీసుకెళ్ళారు. కొద్ది నిముషాల్లోనే ఎనస్థీషియా డాక్టరొచ్చాడు.

తండ్రి ఆగ్రహానికి గురైన సరోజ తల్లిని, బిడ్డని బతికించడానికి ఎంతో కృషి చేసింది. తన వైద్య విజ్ఞానాన్నంతా ఉపయోగించింది. ఎనస్థీషియా సర్జన్ సలహాలు తీసుకుంది. ఆపరేషన్ చేసింది... కాని అప్పటికే చాలా ఆలస్యం జరిగింది.

తల్లైతే బతికింది కాని శిశువు బతకలేదు. మృతదేహాన్ని చూసిన ఆ పేద తల్లితండ్రులు కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్నారు. వాళ్ల నాపడం ఎవరితరమూ కావడం లేదు.

"పొద్దు నాపరేషన్ సేత్తే నా పిల్ల బతికేది. మాకిగ సంతానం కాదు... పైసల కొసం ఎంత పని చేసినవమ్మా" హృదయవిదారంగా ఏడుస్తున్నాడు నర్సయ్య.

నర్సయ్య భార్య స్పృహ తప్పింది. ఆమెకు ఇంజెక్షన్ నిచ్చింది సరోజ. ఏ పని చేస్తున్నా "నువ్వు హంతకివి. నిర్దాక్షిణ్యంగా శిశువును చంపిన కిరాతకురాలివి. దీని కంతటికి నువ్వే బాధ్యురాలివి!" అని అంతా తనను వేలెత్తి చూపిస్తున్నట్టనిపిస్తుంది సరోజకు.

ఆసుపత్రిలో మరణాలు కొత్త కాకున్నా ఇది తన ధన వ్యామోహం వల్ల జరిగిన అన్యాయంగా తోచిం దామెకు. పేషంట్ల ముందు తలెత్తుకోలేకపోతుందామె. ఆమెను పశ్చాత్తాపం దహించి వేస్తుంది.

అక్కడున్న దృశ్యాలను చూసి, కూతుర్నో ఛీత్కారపు చూపు చూసి తన గదిలో కెళ్ళాడు రాజేశం.

చాలా తక్కువ కాలంలోనే మంచి హస్తవాసిగల డాక్టరుగా పేరు తెచ్చుకొన్న తన కూతురు డబ్బు మనిషిగా, బాధ్యతారహితంగా ప్రవర్తించడం రాజేశానికి బాధాకరంగా ఉంది. చిన్నప్పట్నుంచి తానెన్ని జాగ్రత్తలు తీసుకొని పెంచినా, ఆదర్శాలు బోధించినా తన కూతురిలా ఎందుకు మారిందో అతని కర్థం కావడంలేదు. తన పెంపకంలో లోపముందా? తనను తానే ప్రశ్నించుకున్నాడు రాజేశం. కూతురు ముఖంలో పశ్చాత్తాపాన్ని గమనించాడు. ఇనుము వేడిగా ఉన్నప్పుడే ఇష్టమున్న రీతిలోకి మార్చవచ్చన్న విషయాన్ని జ్ఞాపకం చేసుకున్నాడు.

కొద్ది సేపాగి కూతుర్ని తన గదిలోకి పిలిపించుకున్నాడు. ఆమె పక్కనే కూర్చొని అనునయంగా భుజంపై చెయ్యేశాడు.

తన కాళ్ళు పట్టుకొని దీనంగా బతిమిలాడుతున్న నర్సయ్య ముఖం. మృతశిశువును చూస్తూ గోడు గోడున ఏడ్చే తల్లితండ్రులు, తన తండ్రి చూపిన ఛీత్కారపు చూపు - డాక్టర్ సరోజ తాను చేసింది తప్పని తెలుసుకొనేలా చేస్తున్నాయి. దానికి తోడు తండ్రి తన నేం తిడతాడేమోనని భయపడ్తుందామె.

"సరోజా! నేను నిరుపేద కుటుంబంలో పుట్టాను. దుర్భరమైన దారిద్ర్యాన్ని అనుభవించాను. ఎలాగో కష్టపడి చదువుకున్నాను. చిన్న ఉద్యోగం సంపాదించుకు

న్నాను. క్రమక్రమంగా పైకొచ్చాను. ఆర్థిక స్థితిగతుల్లోనూ మధ్యతరగతి కెదిగాను. మధ్యతరగతి తండ్రికి కూతురుగా పుట్టావు నీవు. కాని మధ్యతరగతి జీవితాల్లోని కష్టాలు తెలియకుండా పెంచాను నిన్ను. నువు డాక్టరువయ్యావు. క్రమక్రమంగా మధ్యతరగతి లోంచి ఉన్నత వర్గంలోకి అడుగు పెట్టబోతున్నావు. ఇలా ఎదగటం నేరంకాదు. నిన్ను నాలాగే మధ్యతరగతి జీవితమో, నా చిన్నప్పటిలా పేదరికపు బతుకో బతకమనడం లేదు... కాని..." అని ఆగాడు రాజేశం.

తండ్రి మాటలను శ్రద్ధగా వింటుంది సరోజ. "కాని, నువ్వు బంగారు చెంచా నోట్లో పెట్టుకొని పుట్టినట్లే ప్రవర్తిస్తున్నావు. ఆకాశం నుండి ఊడిపడినదానిలా నడుచుకుంటున్నావు. మన పూర్వపు స్థితిని మరచిపోతున్నావు. నీ కంటే తక్కువ స్థాయి మనుషులతో సంబంధమే లేనట్టు ప్రవర్తిస్తున్నావు. నేను దిగువ తరగతి నుండి మధ్యతరగతి కెదిగినా నా వాళ్లను మరిచిపోలేదు. అంటే, నా కున్న డబ్బునంతా వాళ్లకు ధారబోశానని కాదు. నాకు చేతనైనంత వరకు నాకు సాధ్యమైన రీతిలో నా వాళ్లకు సాయం చేశాను. కనీసం వాళ్లంటే సానుభూతితోనైనా ఉన్నాను. వాళ్ల సమస్యలను మానవతా దృక్పథంతో అర్థం చేసుకున్నాను. కాని, నువ్వో? అందుకు పూర్తి భిన్నంగా... నా మాటలు నీకు చాదస్తపు మాటలుగా తోచవచ్చు. కాని, నేనీ మాటల్ని ఎంతో ఆవేదనతో అంటున్నాను" అన్నాడు రాజేశం.

ఈ మాటలను మరెవ్వరు చెప్పి ఉన్నా వాటిని చాదస్తపు ముసలివాళ్ల మాటలుగానే భావించేది సరోజ. కాని, ఆ మాటలను తాను డాక్టరవడానికి, తన అభివృద్ధికి మూలకారకుడైన తండ్రి చెప్పడం వల్ల శ్రద్ధగా వింటోంది.

"నేను నర్సయ్యతో అలా ప్రవర్తించడం తప్పే. నేను నా తప్పు నొప్పుకుంటున్నాను" అన్నది సరోజ.

నీవిప్పుడు తప్పు నొప్పుకుంటున్నంత మాత్రాన చనిపోయిన శిశువు తిరిగివస్తాడా? వాళ్లకు సంతానం కలుగుతుందా? డబ్బు మనిషికి ముఖ్యమే నమ్మా! నేను కాదనడంలేదు. కాని డబ్బే సర్వస్వం కాకూడదు. డబ్బు కోసం కనీసంగా ఉండాల్సిన మానవత్వాన్ని కూడా వదులుకోకూడదు. నేను అష్టకష్టాలు పడి నిన్ను డాక్టర్ను చేసింది నువ్వు సుఖంగా బ్రతకాలని మాత్రమే కాదు - కొంత మందికైనా సహాయకారిగా ఉంటావని..."

"ఈ విషయంలో నేను కొంత అమానుషంగానే ప్రవర్తించాను...కాని, డబ్బు తీసుకొని వైద్యం చేయడం తప్పా నాన్నా?"

"అని నేనన్నానా? కాని, డబ్బు కోసం ప్రాణాలు తియ్యడం తప్పు. నువ్వు చేసిన ఆలస్యం వల్లే ఆ శిశువు చనిపోయింది. అమ్మా సరోజా, ఈ మనుషుల స్వభావాలే నా కర్థం కావడంలేదు, ఏ సమాజం నుంచైతే వస్తున్నాడో మనిషి, ఆ మనిషే ఎదిగిన తర్వాత, ఆర్థికంగా బలపడింతర్వాత ఆ సమాజాన్ని, ఆ మనుషులను మరిచిపోతున్నాడు. తన సమాజంలోంచి ఎదిగిన వ్యక్తి నుంచి ఆ సమాజపు మనుషులు ఎంతో కొంత ఆశిస్తారన్న విషయాన్ని మరిచిపోతున్నాడు. వాళ్ల

కోసం ఏళ్ల తరబడి కష్టపడి సమకూర్చుకున్న సౌకర్యాలను వదులుకొమ్మని నేను చెప్పడంలేదు. కాని, తమ మనుషుల పట్ల కనీస సానుభూతైనా ఉండాలంటున్నాను. ఇది కూడా అత్యాశేనా?" అన్నాడు రాజేశం.

"నన్ను క్షమించు నాన్నా! ఇంకెప్పుడూ ఇలా ప్రవర్తించను."

"ఇందులో క్షమాపణల ప్రసక్తెందుకు...? కాని, ఒక్క విషయ మడుగుతాను. జవాబు చెబుతావా?" అన్నాడు రాజేశం.

తలూపింది సరోజ.

"ఆ స్థితిలో నర్సయ్య కాక, కార్లో వచ్చిన ఓ ధనవంతుల కుటుంబం ఉందనుకో - నువ్వలాగే ప్రవర్తించేదానివా? మొదట ఆపరేషన్ చేసేదానివా?"

"మీ కందరూ మంచివాళ్లలాగే కనబడుతారు. అలాంటి వాళ్లను నమ్మకూడదు. పనయిపోయిన తర్వాత డబ్బు లేదంటే ఏం చేసేది? వాళ్లకు నిజాయితీ ఉండదు" అంది సరోజ.

ఆ మాటలకు కోపం వచ్చింది రాజేశానికి.

"ఏమన్నావమ్మా? పేదవాళ్లకు నిజాయితీ ఉండదనా? వాళ్లకున్న నిజాయితీ ఎవరికుంటుందమ్మా? తండ్రులు చేసిన బాకీ కిందికి తరతరాలుగా పాలేర్లుండి బాకీ తీర్చిన వారున్నరమ్మా? నీ కీ విషయాలు తెలియవు" అన్నాడు.

తాను తప్పొప్పుకున్నా తండ్రి పదే పదే చెప్పడం సరోజకు నచ్చలేదు.

"నాన్నా! నర్సయ్య విషయంలో నాది తప్పేనని ఇదివరకే చెప్పాను. అయితే అందరు డాక్టర్లలాగే నేనూ ప్రవర్తించాను. అసలీ లోకమే డబ్బుతో నడుస్తుంది నాన్నా!"

కూతురు మాటలు షాక్‌లా తగిలాయి రాజేశానికి. ఆమెలో కొంతైనా మార్పు తీసుకురావడానికి కేవలం తన మాటలు సరిపోవనుకున్నాడు. ఓ దృఢ నిర్ణయం చేసుకున్నాడు. తామేమిటో, తమ బతుకేమిటో ఆమెకు తెలియజేయాలనుకున్నాడు.

"లోకమే డబ్బుతో నడుస్తుందంటావామ్మా! కావచ్చు కాని, డబ్బంటే మితిమీరిన వ్యామోహమే మనిషిని మనిషి కాకుండా చేస్తుంది. అయితే పొట్టనింపుకోవడానికే, కేవలం పొట్ట నింపుకోవడానికే కొందరు మనుషులు ఎన్ని యాతనలు పడాల్సివస్తుందో నీకు తెలియదమ్మా! సరే కాని, రేపు మనం మన ఊరెల్దాం, రెండ్రోజులు నర్సింగ్ హూం బాధ్యత లెవరికైనా అప్పగించు" అని లేచి నిల్చున్నాడు రాజేశం.

"నే నెందుకు నాన్నా, ఊరికి...? మీరెల్లిరండి."

"చిన్నప్పుడెప్పుడో చూశావు నువ్వా ఊరిని, మనిద్దరం కలిసే వెల్దాం. తయారవు" అని అక్కణ్నుంచి వెళ్లిపోయాడు రాజేశం.

☆ ☆ ☆

రైలు, రెండు బస్సులు మారి కూతురితో పాటు ఆ మారుమూల పల్లెటూళ్లో అడుగుపెట్టాడు రాజేశం. బస్సు దిగిన రాజేశాన్ని అక్కడున్న చాలా మంది ఆప్యాయంగా పలుకరించారు. అతని కూతురు సరోజను గూర్చి అడిగారు. అందరికి

నవ్వుతూ సమాధాన మిచ్చాడు రాజేశం. సరోజను కొంద రాశ్చర్యంగా చూస్తున్నారు. కూతుర్ను వెంటబెట్టుకొని మిత్రుడు రాజారావు ఇంటి దిక్కు నడుస్తున్నాడు రాజేశం. తోవలో ఎంతో మంది పలుకరిస్తున్నా రతన్ని. కూతుర్ని గూర్చి అడుగుతున్నారు. అందరికీ ఓపిగ్గా సమాధానం చెబుతూ మిత్రునింటికి చేరుకున్నాడు రాజేశం. చాలా కాలం తర్వాత వచ్చిన మిత్రుణ్ణి సాదరంగా ఆహ్వానించాడు రాజారావు. స్నానం, భోజనం ముగించి కొద్దిసేపు ప్రయాణ బడలిక తీర్చుకున్నారు.

కూతుర్ని తీసుకొని బయట కెళ్ళాడు రాజేశం. బజార్లో నడుస్తున్న రాజేశంతో–

"బాగున్నావా! కొడుక! అంత మంచిగున్నరా?"

"ఈ మెవ్వలు, నీ బిడ్డనా?"

"కొడుకులు, బిడ్డ లెంతమంది కొడుక?"

"ఎందరేడిది ఒక్కతే బిడ్డాయె." అని మాట్లాడుతున్నారు.

"ఎంత మంచిగుంది బిడ్డ..."

"చిదిమి దీపం బెట్టుకోవచ్చు"

"పెద్ద డాక్టరమ్మయిందట కదా!"

"బిడ్డనైతే బాగ సదివించిండు రాజేశన్న."

"కొడుకైన బిడ్డయిన గాపిల్లనాయె రాజేశంకు."

సరోజ గూర్చి అడుగుతున్నారు. మాట్లాడుతున్నారు.

"ఊర్ను మరిసేపెయిండు రాజేశన్న."

"గట్లెందుకంటవే తాపకోసారి మా అత్తండు."

"పిల్లలత్తండ్రా మరి?"

"గా పట్నంల పెరిగినో ల్లేమస్తరు తియ్యి." రకరకాలుగా, కొంద రాప్యాయంగా, కొందరు నిష్ఠూరంగా మాట్లాడుతున్నారు. అందరికీ నవ్వుతూ సమాధాన మిస్తున్నాడు రాజేశం. తన తండ్రిని అంతమంది అంత ఆప్యాయంగా పలుకరించడం కొత్తగా ఉంది సరోజకు. ఒకర్నొకరు పట్టించుకోని పట్టణాల్లో ఇలాంటి పలుకరింపుల నామె చూసింది అతి తక్కువే.

కూతుర్ని తీసుకొని ఓ పాడుబడిన గుడిసె దగ్గరికి వెళ్లాడు రాజేశం. చీకు పట్టిన తాటికమ్మలతో, రాలుతున్న మట్టిగోడలతో శిథిలావస్థలో ఉందా గుడిసె. గుడిసె ముందో పక్కన బావి. బావి దగ్గర మట్టి కుండలు, మట్టి గోళెం...వాట్లో నీళ్లు... బావి పక్కనే మురికినీళ్ల జాలరి, దాన్నిండా దోమలు...గుడిసెకు కొంచెందూరంలో పెంట బొంద. అందులో చెత్తా చెదారం. అటు దిక్కు చూసి ముఖం చిట్లించింది సరోజ.

వాకిట్లో ఉన్న కుక్కినులక మంచంలో కూర్చోనుందో పదేళ్ల అమ్మాయి తైల సంస్కారం లేక చిక్కిరి బిక్కిరిగా ఉన్న తల వెంట్రుకలను రెండు చేతుల్తో

బరుక్కుంటున్న ఆ అమ్మాయి రాజేశాన్ని, సరోజను చూసి లేచి నిల్చుంది. సరోజను కొద్ది క్షణాలు కన్నార్పకుండా చూసింది.

"అవ్వా! అవ్వా! పెద్ద నాయన్నచ్చిండే... ఎంబ డెవ్వలో దొరసా నచ్చిందే..." తల బరుక్కుంటూనే గుడిసెలో కెళ్లిందా అమ్మాయి. సాయంత్రం వంట కోసం గుడిసెలో పొయ్యంటుబెట్టడానికి సతమతమవుతున్న చిలుకమ్మ కండ్లు నలుచుకుంటూ, పొగ వల్ల కళ్ల వెంట కారుతున్న నీళ్లను కొంగుతో తుడుచుకుంటూ బయటకొచ్చింది. మాసినతలతో, మాసికలు పడ్డ రవికెతో, మసి మరకలున్న చీరతో 'అమ్మోరి'లా ఉన్న చిలుకమ్మను చూసి జడుసుకున్నంత పన్జేసింది సరోజ.

"బావా! మీ రచ్చింగ్రా!" అని గుడిసె లోపలి కెళ్లి ఓ నులకమంచం తీసుకొచ్చి వాకిట్లో వాల్చింది. మళ్ళీ గబాగబా లోపలి కెళ్లి ఓ 'చద్దరు' తీసుకొచ్చి మంచంలో పరిచింది.

"కూర్చోండి" అని దూరం జరిగింది చిలుకమ్మ. రాజేశం నిస్సంకోచంగా మంచంలో కూర్చున్నాడు.

మురికిగా, మొరటుగా ఉన్న ఆ ఛద్దరు మీద కూర్చోడానికి సంశయిస్తూ ఇక తప్పదని కూర్చుంది సరోజ.

చిలుకమ్మ కూతురు, ఎనిమిదేళ్ల కొడుకు దూరంగా నిల్చుని సరోజని కన్నార్పకుండా చూస్తున్నారు. ఓ అపురూపమైన వస్తువును చూస్తున్నట్టు చూస్తున్నారు చుట్టుపక్కల పిల్లలు కూడా వచ్చి అక్కడ తాము చూడరాని వస్తువును చూసినట్టు చూస్తున్నారు. తన పనిమనిషికన్నా కడు హీనంగా ఉన్న చిలుకమ్మ తన తండ్రిని 'బావా' అనిపిలవడం, జిడ్డోడుతున్నట్టున్న పిల్లలంతా తనను వింతగా చూడడం, సరోజకు చిరాకుగా ఉంది. ఆ ప్రదేశమంతా రోతగా కనబడ్తొందామెకు. తండ్రి అంతర్యమేమిటో ఆమెకు బోధపడటం లేదు. ముళ్ల మీద కూచున్నట్లు కూర్చునుందామె.

"మన సరవ్వనా బావ! ఎప్పుడో ఏలెడంతున్నప్పుడు చూసిన... పెద్ద డాక్టరమ్మయిందట కదా! అవునా బిడ్డ?" అని సరోజ మీద చెయ్యేయబోయింది చిలుకమ్మ. ఆమె దగ్గరకు రావడం చూసి, చీదరించుకున్నట్టు చూసింది సరోజ. ఆమె అనిష్టతను గమనించి చేతిని వెనక్కు తీసుకుంది చిలుకమ్మ.

రాజేశం అంతా గమనిస్తూనే ఉన్నాడు.

"సరోజ డాక్టరమ్మైంది. సూదులియ్యమంటావా నీకు?" పరాచిక మాడాడు రాజేశం.

"నా బిడ్డ సూదులిత్తనంటే నేను వద్దంటానా?" అంటూ నవ్వింది చిలుకమ్మ.

చిలుకమ్మ తనను బిడ్డని సంబోధించడం సరోజకు నచ్చలేదు. కాని తండ్రిముందే మనలేకపోతుంది. కూతురు ముఖంలోని భావాలు చదువుతున్నాడు రాజేశం.

"సరోజా! నీకు చెప్పడం మరిచాను. ఇదే గుడిసె నేను ఒకప్పుడున్న ఇల్లు. నేనీ గుడిసెలోనే పుట్టాను. నా బాల్యమంతా ఈ గుడిసెలోనే గడిచిపోయింది. ఈ గుడిసెలోనే ఉండి చదువుకున్నాను. మా నాన్న కట్టెలు కొడుతూ వంట చెరుకుగా అమ్ముకుంటూ బతికేవాడు. పూట గడవడం కూడా కష్టంగానే ఉండేది.

అయినా నన్ను చదివించాలని పట్టుబట్టాడు. అష్టకష్టాలు పడి చదివించాడు. నేను మెరిటోరియస్ కావడం వల్ల స్కాలర్‌షిప్ కొంత తోడ్పడింది. నా చదువయిపోయే సమయానికి మా అమ్మా, నాన్న లిద్దరు మరణించారు. అక్కకు అంతకు ముందే పెళ్లయింది. నాకీ ఊళ్ళో ఆస్తంటూ ఉంటే ఈ గుడిసె. నేను పుట్టి పెరిగిన ఊరి జ్ఞాపకార్థంగా ఈ గుడిసె నలాగే ఉంచుకున్నాను.

"వీరయ్య నాకు చిన్నాన్న కొడుకు. నాకు తమ్ముడు. చిలుకమ్మ నీకు చిన్నమ్మ... అదుగో, వాళ్ళు నీకు తమ్ముళ్లు, చెల్లెండ్లు. ఈ గుడిసె ఖాళీగా ఉండడ మెందుకని వీళ్ల నుంచాను..." అని కూతురు దిక్కు చూశాడు రాజేశం.

సరోజ ముఖంలో రంగులు మారుతున్నాయి. అందమైన ఆమె ముఖం నల్లగా పాలిపోయింది. పోలియోతో బాధపడుతూ కుంటుతున్న కుర్రాడు, చీమిడి ముక్కులతో మురికి మురికిగా ఉన్న ఆ పిల్లలు, చింపిరి జుట్టు పిల్ల... వాళ్లంతా తన రక్తసంబంధకులన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతూందామె. జారుతున్న నిక్కర్లను పైకిలాక్కుంటూ, కారుతున్న చీమిడిని నాలుకతో అద్దుకుంటూ మరో ఇద్దరు పిల్ల లొచ్చి అక్కడ నిల్చున్నారు. వాళ్ళు వీరయ్య తమ్ముని పిల్లలని తెలుసుకున్న సరోజ తన 'పాలి' వాళ్ళను చూసి ఆశ్చర్యపోయింది.

ఆ వాడకుండే ఇద్దరు ముగ్గురు స్త్రీలొచ్చి రాజేశాన్ని పలుకరించచారు.

"మంచిగున్నావా కొడుక? ఎంత పెద్దోనివైనా గింత కూడా గురువం లేదు బిడ్డా... నీ అసొంటోల్లెంత మందుంటారు?" ఓ ముసలమ్మ రాజేశం మీద చేతులేసి, నిమురుతూ అంది.

"మనదాంట్లో ఆడోల్లను ఇంత బాగ సదివిచ్చినోల్లు లేరు" అంది ఒకామె.

"డాక్టరమ్మ మా ఊళ్లె దవఖాన పెడ్తవా?" సరోజను మాట్లాడించాలని ప్రయత్నించింది ఒకామె.

"నువ్వు మా ఊరి దానివే నైతివి. పెట్టకుంటేంజేత్తవు" అంది మరొకామె.

సరోజ కిదంతా అదోలా ఉంది. కొంత చికాకుగానూ ఉంది. వాళ్లకేం సమాధానం చెప్పాలో అర్థంకాక వింటూ కూర్చుంది.

"ఎంది డాక్టరమ్మ, మాట్లాడితె నోటిముత్యాలు రాలిపోతాయా ఏంది?" అందొకామె.

"మనసొంటి మోటోల్లతో నెందుకు మాట్లాడుతది" అంది మరొకామె.

వాళ్ల అప్యాయతలను, నిష్ఠూరాలను అన్నీ వింటోంది సరోజ.

డాక్టరుగా తన నర్సింగ్‌హోమ్‌లో ఇలాంటి వాళ్ళందరితోనూ మాట్లాడింది కాని, ఇలాంటి పరిస్థితిలో ఏం మాట్లాడాలో ఆమె కర్థం కాలేదు.

"ఇక్కడ దవఖానెందుకు పెట్టను? మీరు కావాలంటే పెడతాను?" అంది నవ్వుతూ సరోజ.

"గిక్క డెందుకు నువ్వంటవు కని కడుపునిండే మాటన్నవు బిడ్డ. నీ కడుపు సల్లగుండ" అంది వృద్ధురాలు.

"పోతన్న బిడ్డ" అని కట్టె సహాయంతో నడుస్తూ వెళ్లిపోయింది. ఆమెతో పాటు మిగతా స్త్రీలు కూడా వెళ్లిపోయారు.

"చల్ల బొట్టేయ్యనా బావ" అంది రాజేశంతో చిలుకమ్మ. కూతురు దిక్కు చూశాడు రాజేశం.

"వద్దు, ఇప్పుడే తాగొచ్చాం" అన్నాడు.

ఇంతలో దొడ్డు బనీను, పంచె కట్టుకొనున్న వీరయ్య బరువైన నాగ లెత్తుకొని వచ్చాడు. అతని చేతులు కాయలు గాస్తున్నాయి. శరీరం పొగవారి మొరటుగా ఉంది. నాగలిని కింద పడేసి పంచెతో చెమటలు తుడుచుకున్నాడు. రాజేశం దగ్గరి కొచ్చి

"ఎప్పుడొచ్చినవే అన్న?" అన్నాడు.

"ప్రొద్దున్నే వచ్చాం నీ ఆరోగ్యం బాగుందా?" అన్నాడు రాజేశం.

"ఏం మంచిగనే అన్న... గట్ల గట్లనే ఉంటంది. మా అసోంటోల్లకు టీ.బి. రోగ మస్తే ఎట్ల పోతదే? మందులకు పైస లేదున్నయి? దొర దేవిడీల పనిచేసి చేసి ఇగో, గిట్ల ఎందుకొచ్చిన?" అన్నాడు వీరయ్య.

అతని దిక్కు జాలిగా చూశాడు రాజేశం. ఆ మాటలు నిజమే నన్నట్టు తలూపాడు.

"ఈ ల్లెవ్వలు? మన సరవ్వేనా? పెద్ద డాక్టరైయిందట కద" సరోజను అపురూపంగా చూస్తూ అన్నాడు వీరయ్య.

"అవును నాలుగేండ్లాయె. యాడాదాయె నర్సింగ్ హోం కూడా పెట్టింది" అన్నాడు రాజేశం.

"నువ్వు కష్టపడి సదివించినవు" అన్నాడు వీరయ్య.

తలూపాడు రాజేశం.

"సరోజా! ఈయన మీ చిన్నాన్న. తండ్రి చేసిన బాకీ కిందికి దొర దేవిడీలో పదేళ్ళు జీతం లేకుండా పని చేశాడు. రక్త మాంసాలన్నీ దొరసేవకే ధారపోశాడు. మన వంశంలో చాలా మంది పాలేర్లుగా, వెట్టి వాళ్లుగా, కూలివాళ్లుగానే బతికారు. బాకీల కిందికి ఏళ్లతరబడి జీతాలు లేకుండా పనిచేశారు. మనది బాకీ సంతతేనమ్మా! బాకీ సంతతి! నీకు కొన్ని నిజాలు తెలియాలని ఈ విషయాలు చెబుతున్నాను." అ మాట లంటున్న రాజేశం కంఠం గద్గదమైంది. హృదయం భారమైంది. కష్టమంటేంటో తెలియకుండా అపురూపంగా పెంచుకున్న కూతురు కా విషయా లెందుకు చెబుతున్నాడో అర్థం కాక చిలుకమ్మ, వీరయ్య రాజేశం దిక్కు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

అ మాటలు విన్న సరోజ మనసు వికలమైంది. హృదయాంతరాల్లోంచి బాధ తన్నుకొస్తుంది. నర్సయ్యతో తానన్న మాటలు, ప్రవర్తించిన తీరు జ్ఞాపకం వస్తున్నాయి. ఆమె మనసు మూగగా రోదిస్తుంది.

వీరయ్యతో కొద్దిసేపు మాట్లాడి లేచి నిల్చున్నాడు రాజేశం. మరికొందరు దాయాదులింటికి తీసుకెళ్ళాడు. బంధువులింటికి తీసకెల్లాడు. అందరి పరిస్థితీ

దాదాపు ఒక్క తీరుగానే ఉంది. విటమిన్ లోపంతో బాధపడుతున్న వాళ్ళు, రోగాలు రొష్టులతో సతమతమవుతున్న వాళ్ళు, అసలే చదువులేని వాళ్ళు, దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్న తనవాళ్లను చూసింది సరోజ. ఎన్నో జుగుప్సాకరమైన దృశ్యాలను చూసింది. తన రక్త సంబంధీకులు ఇంత అధ్వాన్నస్థితిలో ఉంటారని సరోజ కలలో కూడా ఊహించలేదు. తన దగ్గర స్కావెంజర్లుగా పనిచేసే వాళ్లకంటె కూడా హీనమైన పరిస్థితుల్లో తన 'పాలి' వాళ్లుండడం ఆమెకు భరింపరానిదిగా ఉంది.

"నాన్న చదువుకొనుండకపోతే? తనను చదివించి ఉండకపోతే? తాను కూడా ఇలాగే మురికి మురికిగా అనారోగ్యంగా, అధ్వాన్నంగా దుర్భర దారిద్ర్యంతో..."

ఇక ఆలోచించలేకపోయింది సరోజ.

ఆ రాత్రి ఆమెకు నిద్ర పట్టలేదు.

తెల్లవారి ఊళ్లోకి తీసుకెళ్ళి మరికొన్ని విషయాలను చెప్పాడు. పొలాల్లోకి తీసుకెళ్లి చూపించాడు రాజేశం. పొట్టకూటి కొరకే రాత్రింబవళ్ళు కష్టపడే శ్రమజీవుల గురించి చెప్పాడు. నాగేటి చాళ్లకే అంకితమై బ్రతుకుతున్న భూమి పుత్రులను చూపించాడు. బాకీల సుడిగుండంలో కొట్టుమిట్టాడే జనాల గూర్చి చెప్పాడు. గ్రామాల్లోని దుర్భర పేదరికాన్ని, వెనుకబాటుతనాన్ని, వాళ్లలోని నిజాయితీని సరోజకు అర్థమయ్యేలా చెప్పాడు, చూపించాడు రాజేశం.

ఆ రోజు రాత్రి కూడా సరోజకు సరిగా నిద్రపట్టలేదు. ఈ రెండ్రోజులుగా ఆ పల్లెటూళ్లో ఎన్నో విషయాలని చూసిందామె. తానింతకాలంగా చూడని విషయాలను చూసింది.

పల్లీయుల అప్యాయతలను చూసింది. వారిలోని అనురాగాన్ని చూసింది. కల్తీలేని ఆత్మీయతను చూసింది. వాళ్లలోని గడుసుతనాన్ని కూడా చూసింది. తాను చూసిన విషయాలనన్నీ మననం చేసుకుంది. పేదవాళ్లతో తాను ప్రవర్తించిన తీరును జ్ఞాపకం చేసుకుంది. ఇలాంటి నిరుపేద జనాన్ని ఆమె పట్నంలోనూ చూసింది.

కాని, ఇంత దగ్గరగా – అదీ తన రక్తసంబంధీకుల్లో – చూడటం ఆమెకిదే మొదటిసారి. పేదవాళ్లను నిజాయితీ లేనివాళ్లనడం, నమ్మకూడదని నిందించడం జ్ఞాపకం చేసుకుంది. నర్సయ్య కంటే దుర్భర పరిస్థితుల్లో తన వాళ్లే ఉండటం గమనించింది. తన రక్త సంబంధీకుల దుర్భర పరిస్థితులను కళ్లారా చూసిన సరోజలో సంఘర్షణ మొదలైంది. తన కుటుంబ మెలాంటిదో ఆమె అర్థం చేసుకుంది.

అలాంటి వాళ్లకు తానేం చేసింది? పైగా వాళ్లకు నిజాయితీ ఉండదని నిందించింది. తన ప్రవర్తనకు తనను తానే నిందించుకుంది సరోజ.

తండ్రి తన నా ఊరు కెందుకు తీసుకొచ్చాడో ఇప్పుడర్థమైంది సరోజకు.

తెల్లవారి తండ్రితో పాటు పట్నం వెళ్ళింది సరోజ. రెండ్రోజులు గడిచాయి. ఆమెలో జరుగుతున్న సంఘర్షణను గమనిస్తూనే ఉన్నాడు రాజేశం. మధ్యాహ్నం భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటున్న కూతురు గదిలో కెళ్లాడు. కూతురు కెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"సరోజా! నీ కో విషయం చెప్పడం మరిచిపోయాను. చెప్పకూడదనే అనుకున్నాను. కాని, ఇప్పుడుకూడా చెప్పకుండా ఉండడం బాగుండదని చెబుతున్నాను. నీలాగే - సరిగ్గా నువ్వు నర్సయ్యతో ప్రవర్తించినట్టే ఓ డాక్టర్ మీ మేనమామతో ప్రవర్తించడం వల్ల మీ అమ్మ నిన్ను కని పురిట్లోనే మరణించింది. ఉద్యోగ రీత్యా దూరప్రదేశంలో ఉండటం వల్ల నేనా సమయంలో అక్కడ లేను" అని ఆగాడు రాజేశం.

గ్రామంలోని సంఘటనల నింకా మరిచిపోని సరోజకు తండ్రి తీసుకొచ్చిన తల్లి ప్రసక్తితో దుఃఖమాగింది కాదు. ఆమె హృదయం పశ్చాత్తాపంతో దహించుకుపోతుండగా చిన్నపిల్లలా ఏడ్చింది. ఆమెను కొంతసేపేడ్వనిచ్చి దగ్గరకు తీసుకొని ఓదార్చాడు రాజేశం.

"తన వాళ్లలోంచి చదువుకొని పెద్దవాళ్లైతే తమ కెంతో ఉపయోగపడ్తా రనుకుంటారు జనాలు. వాళ్ల నుంచి ఎంతో ఆశిస్తారు. కాని, వాళ్లు పెద్దవాళ్లైన తర్వాత వాళ్లను మరచిపోతున్నారు. తమ పునాదుల్నే విస్మరిస్తున్నారు. కనీసంగా చేయాల్సింది కూడా చేయడం లేదు. కనీస మానవత్వం కూడా చూపడం లేదన్నదే నా బాధ.

"సరోజా! నిన్ను పల్లెటూళ్లో ప్రాక్టీస్ పెట్టమని కోరడం లేదు. ఉచితంగా వైద్యం చేయమనీ చెప్పడం లేదు. కాని, డబ్బు కోసం మానవత్వాన్నే వదులుకోవద్దని ప్రార్థిస్తున్నాను. నీ పునాదులనే మరిచిపోవద్దని కోరుతున్నాను. ఈ మాటలు నీకు బాధ కలిగిస్తే మన్నించు" అని లేచాడు రాజేశం.

"నాన్నా! ఇకముందు మీరు నా నుండి అలాంటి ప్రవర్తన చూడరు" అని తండ్రి కాళ్లకు నమస్కరించింది సరోజ.

కూతుర్ని పైకి లేపి తలపై చేయుంచి ఆ గదిలోంచి వెళ్లిపోతున్నాడు రాజేశం. తండ్రి దిక్కే చూస్తూ సరోజకు అతడు కర్తవ్యం విస్మరించిన పార్థునికి గీతోపదేశం చేసిన పార్థసారథిలా కనబడుతున్నాడు. తాను వెళ్లొచ్చిన ఊరు సిద్ధార్థుడిని బుద్ధుడిగా మార్చిన పుణ్యభూమి 'బుద్ధగయ'లా కనబడుతోంది.

● ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, డిసెంబర్ 7-13, 1994 ●

* * *